# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


గజ్వేల్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 17: ఆపదలో ఆదుకునే సీఎంఆర్ఎఫ్ పథకంలో కూడా ప్రభుత్వం కోతలు విధిస్తున్నదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 47మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ పట్టణానికి చెందిన గుంటుక బాలకృష్ణ ప్రైవేట్ దవాఖానలో చికిత్స కోసం సుమారు రూ.47లక్షలు ఖర్చు చేశాడన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకుంటే అతడికి ప్రభుత్వం రూ.60వేలు మంజూరు చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు చాలా ఉన్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి సీఎంఆర్ఎఫ్ నిధులు పెంచి పేదలను ఆదుకోవాలని ఆయన కోరారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం లక్షలాది మందిని ఈపథకం ద్వారా ఆదుకుందని గుర్తుచేశారు. ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స కోసం పేదలు అప్పులు చేసి చికిత్సలు చేయించుకుంటున్నారని, అలాంటి వారికి ఈ పథకం ద్వారా భరోసా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు మధు,నవాజ్‌మీరా, నాయకులు రమేశ్‌గౌడ్, నాయకులు గుంటుక రాజు, హైదర్ పటేల్, ఉపేందర్‌రెడ్డి, మెట్టయ్య, కనకయ్య, రహీం, కిరణ్‌గౌడ్, ఉమర్, అహ్మద్, అబ్దుల్, రాజు, కరీం పాల్గొన్నారు.

# అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి


ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బక్కి వెంకటయ్య, శంకర్

గజ్వేల్, మే 17: సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను అవమానించిన దేవాదాయ శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ శనివారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ పుష్కరాలకు ఆహ్వానించకుండా ఎంపీని అవమానించిన అధికారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఆహ్వాన పత్రికలో ఎంపీ ఫొటో పెట్టకపోవడంతో పాటు ఆహ్వానించకపోవడం తగదన్నారు. ఎంపీ పట్ల వివక్ష కొనసాగితే సామాన్యుల పరిస్థితి ఏమిటన్నారు. దేవాదాయశాఖలో బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది దివాకర్‌పూలే పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్వర్ణోత్సవ శోభ


సిద్దిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

- సిద్దిపేటలో వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు


వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

సిద్దిపేట టౌన్, మే 17: సిద్దిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం స్వర్ణోత్సవ శోభను సంతరించుకుంది. కలియుగ దైవంగా భక్తులు కోరిన కోరికలు తీర్చుతూ సిద్దిపేట ప్రజల ఇలవేల్పుగా మారింది. ఇంతటి మహోన్నతమైన దేవాలయం వెలిసి 50 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్సవ మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని తలపెట్టింది. వారం రోజుల పాటు జరిగే స్వర్ణోత్సవాల్లో భాగంగా చినజీయర్ స్వామి ప్రత్యేక్ష పర్యవేక్షణలో శనివారం వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సామూహిక విష్ణుసహస్రనామస్తోత్రం, నిత్యపారాయణం, ద్వార తోరణపూజ, హోమం, స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు భారీగా తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని తరించారు.

# కాంగ్రెస్ అంటేనే కమీషన్ల పార్టీ

- ఆడబిడ్డలకు తులం బంగారం ఎప్పుడిస్తరు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



కొండంరాజ్‌పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, మే 17: కాంగ్రెస్ అంటేనే కమీషన్ల పార్టీ అని, పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి, అందాల పోటీలు పెట్టి ఒక్కొక్కరికి 30 తులాల బంగారం ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటని మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సోమిరెడ్డి అన్నారు. శనివారం నంగునూరు మండలం కొండంరాజ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందుల్లో ఉంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అందాల పోటీల్లో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్న అన్నా రు. ఇంతవరకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కాలయాపన చేయడం తప్పా ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రమేశ్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సారయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగం గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కృష్టారెడ్డి, బ్రహ్మాచారి, శ్రీనివాస్, చంద్రం, అరవింద్ పాల్గొన్నారు.

## పిడుగుపడి పాడి గేదె మృతి

కోహెడ, మే 17: మండలంలోని బస్వాపూర్‌లో శనివారం తెల్లవారుజామున పిడుగు పడి గ్రామానికి చెందిన వరికోలు సుధాకర్‌కు చెందిన పాడి గేదె మృతిచెందింది. రోజులాగే వ్యవసాయబావి వద్ద పాడి గేదెను ఉంచి వచ్చిన ఆయన తెల్లవారుజామున వెళ్లి చూసే సరికి చనిపోయిఉంది. రాత్రి కురిసిన వర్షంలో పిడుగుపడి మృతిచెందినట్లు నిర్ధారించుకున్నారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

హుస్నాబాద్‌టౌన్, మే 17: చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హుస్నాబాద్‌ఏసీపీ ఎస్. సదానందం హెచ్చరించారు. పట్టణంలోని సుభాశ్‌నగర్, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం కమ్యూనిటీ కాంట్రాక్ట్‌ప్రోగాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా అనుమానాస్పదంగా కనిపించినా, చట్టానికి వ్యతిరేకంగా పనులు జరుగుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి, మత్తుపదార్థాల విక్రయం జరుగుతుందని, దీనిగురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస్ కోరారు. పిల్లల వ్యవహారశైలిని గమనించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని 78మోటర్ సైకిళ్లు, ఆటోలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎస్సైలు అభిలాష్, విజయభాస్కర్, ప్రొబేషనరీ ఎస్సైనవీన్ పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూముల పరిశీలన


ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం సేకరించిన భూములపై ఆరాతీస్తున్న టీజీఐఐసీ ఈడీ నిఖిల్ చతుర్వేది

ములుగు, వర్గల్, మే 17 : ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన భూములను టీజీఐఐసీ ఈడీ నిఖిల్ చతుర్వేది పరిశీలించారు. శనివారం జిల్లా పరిధిలోని ములుగు, కొత్తూరు, తునికిబొల్లారం, వర్గల్, పీర్లపల్లి గ్రామాల్లో టీజీఐఐసీ జిల్లా అధికారులతో కలిసి ఆయన ఇండస్ట్రియల్ పార్కు కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఎంత భూమి అవసరమవుతుంది, ఇప్పటి వరకు ఎంత భూమిని సేకరించారు, ఇంకా సేకరించాల్సిన భూమి ఎంత, సేకరించిన భూమిలో ఏమైనా వివాదాలు ఉన్నాయా తదితర అంశాలపై అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సుమారు వెయ్యి ఎకరాల భూమి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అవసరం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జోనల్ మేనేజర్ అనురాధ, టీజీఐఐసీ డీజీఎంలు రామ్‌దేవ్, నాగరాజు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులను నైపుణ్యవంతులుగా తయారుచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, మే 17: సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల టీచర్ల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఎం.మనుచౌదరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయులు లాజికల్ లెక్కలపై దృష్టిపెట్టి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను మరింత నైపుణ్యవంతులుగా తయారు చేయాలన్నారు. టీచర్లు బలోపేతం అయితే పిల్లలు బలోపేతమవుతారన్నారు. శిక్షణలో భాగంగా కంటెంట్, ఐసీటీ, మెథడాలజీకి సంబంధించి ఇచ్చినటువంటి అంశాలను చక్కగా తెలుసుకొని వాటిని పాఠశాలల్లో అమలుచేయాలన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుల పిల్లలు విస్తృతంగా చదివేలా ప్రోత్సహించి వీలైనంత వరకు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు స్వీయ పాఠకులయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## చేర్యాలలో భారీ వర్షం


చేర్యాలలో కూలిపోయిన మడేశ్వరస్వామి ఆలయ ప్రహరీ

చేర్యాల, మే 17: చేర్యాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన అనంతరం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటన్నరపాటు ఉధృతమైన గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం పడటంతో వ్యవసాయ దుక్కుల్లో వర్షం నీరు నిలిచింది. కొన్ని రోజులుగా ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రాత్రి కురిసిన వర్షం ఒకింత ఊరటనిచ్చింది. వ్యవసాయ క్షేత్రాలు, బీడుభూముల్లో వర్షం నీరు నిల్వడంతో రైతులు దుక్కులు దున్నేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.ఎన్నడూ లేని విధంగా మే మూడో వారంలో భారీ వర్షం పడటం కొన్ని సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారని పలువురు రైతులు తెలిపారు. భారీ వర్షం రావడంతో పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా కరెంటు సరఫరా నిలిచిపోయింది. తిరిగి శనివారం వేకువజామున రెండు గంటలకు కొన్ని ప్రాంతాల్లో, పట్టణంలోని కేపీఆర్ కాలనీలో ఉదయం తొమ్మిది గంటల తర్వాత విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


గాగిళ్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్ రహీం

మద్దూరు(ధూళిమిట్ట), మే 17: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మద్దూరు తహసీల్దార్ ఏజీ రహీం అధికారులకు సూచించారు. శనివారం మద్దూరు,గాగిళ్లాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి కాంటా పెట్టాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరిగితే రైతులు ఇబ్బందులు పడుతారన్నారు. వానలను దృష్టిలో పెట్టుకొని నిర్వాహకులు కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం


సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

సిద్దిపేట టౌన్,మే 17 : మున్నూరు కాపుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య అన్నారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి ఎన్నికలు జరుపుతామన్నారు. ఇందులో అన్ని గ్రామాల మున్నూరు కాపు అధ్యక్ష, కార్యదర్శులకు ఓటు హక్కు కల్పిస్తామన్నారు. సమావేశంలో సంఘం నేతలు పాలసాయిరామ్,అల్లం ఎల్లం, ఆకుల బాలయ్య, రాజయ్య,మురళీ, పాండు పాల్గొన్నారు.

## రేపు వేణుగోపాలస్వామి రథోత్సవం

వర్గల్, మే 17: మండల కేంద్రంలో వెలిసిన వేణుగోపాలస్వామి బ్ర హ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తెల్లవారుజామున ఐదు గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గీతాజ్ఞాన మండలి సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా రోజూ దేవతామూర్తుల విగ్రహాలను పురవీధుల్లోఊరేగిస్తున్నారు. శనివారం యాగశాలలో హోమం, హవనం, క్రతువులు వేద పండితుల సమక్షంలో జరిగాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పునర్నిర్మాణదాత టేకులపల్లి రాంరెడ్డి తెలిపారు.

# బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలి


జెండావిష్కరించి నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల, మే 17: మండలంలోని వేచరేణి గ్రామ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని వేచరేణిలో శనివారం సీపీఐ గ్రామశాఖ మూడో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణం నత్తనడకన కొనసాగుతున్నదని, బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.96 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో సకాలంలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా ఎగుర్ల ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా బస్వరాజు నాగరాజు, ఎండీ హబీబ్, కోశాధికారిగా బండారి కనకయ్య, సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఏగుర్ల నరేశ్, ప్రచార కార్యదర్శిగా తరిగొప్పుల రాజయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈరి భూమయ్య, బింగి దుర్గయ్య, జంగిలి యాదగిరి, నంగి కనకయ్య పాల్గొన్నారు.

# చట్టాలపై ప్రయాణికులకు అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బృందం సభ్యులు

చేర్యాల, మే 17: ఎండా కాలం కావడంతో రాత్రి సమయాల్లో ఇంటికి తాళం వేసి ఇంటి ముందు లేదా భవనం పైన నిద్రించే వారు జాగ్రత్తగా ఉండాలని షీటీమ్ బృందం సభ్యు లు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శనివారం ప్రయాణికులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, జరుగుతున్న సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతల గురించి హుస్నాబాద్ షీటీమ్ బృందం సభ్యులు అవగాహన కల్పించారు. షీటీమ్ బృందం మాట్లాడుతూ వేసవి కావడంతో పిల్లలను ఈతకు పంపించవద్దని, మహిళలు వ్యవసాయ పనులకు ఒంటరిగా వెళ్లేటప్పుడు ఒంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, ఏదైనా ఘటన జరిగితే మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ, చేర్యాల పీఎస్ బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలవికాస ప్రతినిధులకు సన్మానం


బాలవికాస సంస్థ ప్రతినిధులు, కమిటీ సభ్యులను సన్మానిస్తున్న చొప్పరి సాగర్

మద్దూరు(ధూళిమిట్ట), మే 17: ధూళిమిట్ట మండలం జాలపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో గ్రామస్తులకు శుద్ధమైన నీటిని అందించిన సంస్థ ప్రతినిధులు, గ్రామ కమిటీ సభ్యులను శనివారం గ్రామ మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ఐదేండ్లు విజయవంతంగా గ్రామస్తులకు తాగునీటిని అందిస్తున్నందుకు బాలవికాస సంస్థకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. ప్లాంట్ నిర్వహణలో గ్రామ కమిటీ పనితీరుపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తుండడంతో తిరిగి అదే కమిటీకి ప్లాంట్ నిర్వహణను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, బాలవికాస సంస్థ ప్రతినిధులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీపీ మందులు సరఫరా చేయాలి


మద్దూరు పీహెచ్‌సీని సందర్శించిన సీపీఎం జిల్లా నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), మే17: మద్దూరు, లద్నూర్ పీహెచ్‌సీలతో పాటు గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలకు ప్రభుత్వం బీపీ మందులు సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం మద్దూరు, లద్నూర్ పీహెచ్‌సీలను సీపీఎం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రాల్లో టెల్మా, ఆమ్లా, బీపీ మాత్రలు, డీపీటీ తదితర మందులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారులు తక్షణమే స్పందించి ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్ మందులు అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల నరేశ్, ఇట్టమైన పరమేష్, కిష్టయ్య, శివశంకర్, పుల్లూరి సురేశ్, తాటి బాబు, బోయిని నర్సింహులు, మిట్టపల్లి రాజు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ హోమం


చేర్యాల: ఎల్లదాసునగర్‌లో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు


హుస్నాబాద్‌టౌన్: నృత్యం చేస్తున్న హనుమాన్ భక్తులు

చేర్యాల, మే 17 : మండలంలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో హన్‌మాన్‌భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు మర్మాముల రామచంద్రమూర్తి, పార్నంది ఆంజనేయశర్మ, దేశపతి అమోఘశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజల సందర్భంగా హనుమాన్ భక్తులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

**వైభవంగా హనుమాన్ శోభాయాత్ర**

హుస్నాబాద్‌టౌన్, మే 17: హుస్నాబాద్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. స్థానిక పాటిమీద హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులతో ఊరేగింపు ప్రారంభమైంది. ఈయాత్ర మల్లెచెట్టు చౌరస్తా మీదుగా అక్కన్నపేట చౌరస్తా నుంచి ఏనేవరకు అక్కడి నుంచి తిరిగి హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జై శ్రీరామ్.. జైశ్రీరామ్ నినాదాలతో రహదారులు హోరెత్తిపోయాయి. కార్యక్రమంలో సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీకౌన్సిలర్ పెరుక భాగ్యారెడ్డి, తనుకు ఆంజనేయులు, నూకల కైలాసం, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, నీలి సారయ్య, వెంకన్న, సతీశ్, సంపత్, భూక్యా రమేశ్ పాల్గొన్నారు.

**ఐనాపూర్‌లో..**

కొమురవెల్లి, మే 17: మండలంలోని ఐనాపూర్‌లో ఎల్లమ్మ ఆలయ సమీపంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ హోమం నిర్వహించారు. హనుమాన్ భక్తులకు కొమురవెల్లి ఎస్సై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణగౌడ్, హన్‌మాన్ స్వాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**గాగిళ్లాపూర్‌లో...**

మద్దూరు(ధూళిమిట్ట), మే17: మద్దూరు మండలం గాగిళ్లాపూర్ హన్‌మాన్ ఆలయంలో హన్‌మాన్ దీక్షాపరుల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. ఆలయ అర్చకులు తాటికొండ ఆగాచారి, అజయ్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఆంజనేయస్వామికి అభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజలతో పాటు హన్‌మాన్ హోమం, పూర్ణాహుతి జరిపించారు. హన్‌మాన్ దీక్షాపరులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, తీర్థప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు జరిపించారు.


కొమురవెల్లి: ఐనాపూర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ హోమం నిర్వహిస్తున్న మాలధారణ స్వాములు


మద్దూరు: గాగిళ్లాపూర్‌లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న స్వాములు

## రేపు స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేట, మే 17: సిద్దిపేట పట్టణం మినీ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈనెల 19న సీనియర్ పురుషులు, మహిళల విభాగంలో జిల్లా స్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక చేస్తున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఫ్రీ స్టైల్ 50 మీటర్లు, 100 మీటర్లు 200 మీటర్లు, బటర్‌ఫ్లై విభాగంలో 50, 100, 200 మీటర్లు, బ్యాక్ స్ట్రోక్ విభాగంలో 50, 100, 200, మీటర్లు, బెస్ట్ స్టాక్ విభాగంలో 50, 100, 200 మీటర్లలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25న సికింద్రాబాద్‌లో జరిగే ఏడో రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, ఈవెంట్‌కి రు.100 చెల్లించి తమ పేరు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాల కోసం సెల్: 9989465 420, 9440 978700 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## చేర్యాల తహసీల్దార్‌గా దిలీప్‌నాయక్

చేర్యాల, మే 17: చేర్యాల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సమీర్‌అహ్మద్‌ఖాన్ ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కొండపాక మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన దిలీప్‌నాయక్ శనివారం చేర్యాల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.గతంలో విధులు నిర్వహించిన సమీర్‌అహ్మద్‌ఖాన్ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

## బెజ్జంకి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గోపాల్


గోపాల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

బెజ్జంకి, మే 17: బెజ్జంకి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ గోపాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మిరుదొడ్డికి బదిలీపై వెళ్లగా డీటీ గోపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## పందిల్లలో మహానంది విగ్రహం ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న భక్తులు

హుస్నాబాద్‌రూరల్, మే 17: మండలంలోని పందిల్లలో మహాలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మహానంది విగ్రహం ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం నుంచి మహానంది విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. దాతల సహకారంతో మహానంది విగ్రహం ఏర్పాటు చేశామని, ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించి ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## వివాహానికి చేయూత


బియ్యం అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, మే 17: నిరుపేద వధువు వివాహానికి సిద్దిపేట వాసవి క్లబ్ చేయూత అందించింది. తల్లిదండ్రులు లేని వధువు అంజలి వివాహానికి శివ్వ శ్రీనివాస్ పద్మ దంపతుల సహకారంతో 50కిలోల బియ్యం, ఆకుల శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో రూ.2వేల నగదును శనివారం క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణరావుపేట, మే 17: మండలంలోని గుర్రాలగొంది రైతువేదికలో ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండున్నర అంగుళాల నీటి లభ్యత కలిగిన రైతులు ఐదు ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చన్నారు. అంతర పంటలుగా కూరగాయలు, బొప్పాయి, అరటి, పూల మొక్కలు పెంచి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కూరగాయలు, పండ్ల తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.